నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 4 జూలై 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

అండర్ బ్రిడ్జిలోకి వరద..వెళ్లేదెలా ?

మంచిర్యాలలోని రైల్వే అండర్ బ్రిడ్జి కిందకు చేరిన వరదనీరు

మంచిర్యాలటౌన్, జూలై 3: మంచిర్యాల పట్టణంలోని రైల్వే అండర్ బ్రిడ్జిలోకి మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి రెండు వైపులా నుంచి భారీగా వరద నీరు చేరింది. దీంతో కాసేపు రాకపోకలు నిలిచిపోయాయి. హమాలీవాడ, తిలక్‌నగర్, గోపాల్ వాడ, రాజీవ్‌నగర్, దొరగారిపల్లి, అశోక్‌రోడ్, సూర్యనగర్ ప్రజలు ఇబ్బంది పడ్డారు. వాహనాలు నీట మునుగుతుండడంతో సున్నంబట్టివాడకు వెళ్లి ఓవర్ బ్రిడ్జి మీదుగా తిరిగి వెళ్లారు. బుధవారం మధ్యాహ్నం వరకు కాస్త వరద తగ్గింది. వరదనీటిలో మునిగిపోయిన రైల్వే అండర్ బ్రిడ్జిని బుధవారం మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, పలువురు కౌన్సిలర్లు పరిశీలించారు. నీటి తొలగించడంపై అధికారులతో మాట్లాడారు. మెరుగైన డ్రైనేజీ సిస్టంను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ఎమ్మెల్యే పీఎస్సార్ పేరు రాసి

ఆత్మహత్య చేసుకుంటా..

ఆయన అనుచరుడు జగన్మోహన్‌రావు నా భూమి కబ్జా చేసిండు

- ఇద్దరి పేర్లు రాసి ఆత్మహత్య చేసుకుంటా.. అప్పుడే నేను ఎవరో మీకు తెలుస్తది..
- జిల్లా పోలీస్ యంత్రాంగం వారికే సహకరిస్తుందంటూ ఆరోపణలు
- మంచిర్యాల జిల్లా కేంద్రంలో లేఖలు పంచిన అజ్ఞాత వ్యక్తి


అజ్ఞాత వ్యక్తి రాసి మంచిర్యాల జిల్లా కేంద్రంలో పంపిణీ చేసిన లేఖ ప్రతి

మంచిర్యాల, జూలై 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ''ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, వారి బంధువులు, స్నేహితులు మంచిర్యాల జిల్లాలో భూ కబ్జాలతో పెట్రేగి పోతున్నారు. దీనికి హద్దు, అదుపు లేదు. పోలీసులు కూడా వారికే సహకరిస్తున్నారు. నేను వారి బాధితుడినే.. వాళ్ల దౌర్జన్యం మూలంగా నేను త్వరలో ఆత్మహత్య చేసుకోబోతున్నా.'' అంటూ ఓ అజ్ఞాత వ్యక్తి లెటర్ రాసి దాని జిరాక్స్‌ను బుధవారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని షాపుల్లో పంచిపెట్టారు. ఈ లేఖ జిల్లాలో కలకలం రేపింది. అందులోని సారాంశాన్ని క్లుప్తంగా పరిశీలిస్తే.. 'నాకు భూమి అమ్మిన వ్యక్తికి నాకు మధ్య చాలా చిన్న సమస్యలు ఉన్నాయి. నాకు భూమి అమ్మిన వ్యక్తి వాటిని సరిచేసి ఇస్తారు. కానీ.. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అనుచరుడైన జగన్మోహన్‌రావు దూరి నా భూమిని కబ్జా చేసిండు. ఇదేంటని అడిగితే మరోసారి భూమి మీదకు వస్తే మెడకాయ మీద తలకాయ ఉండదని బెదిరిస్తున్నాడు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌కు వెళ్తే మంచిర్యాల ఏసీపీ, మంచిర్యాల పట్టణ సీఐలు వారికే మద్దతు తెలుపుతున్నారు. న్యాయం కోసమని వెళ్లిన బాధితులైన మాపైనే కేసులు బనాయించి ముప్పుతిప్పలు పెట్టి భూములు గుంజుకోవాలని చూస్తున్నరు. ఏసీపీ, సీఐలు జగన్మోహన్‌రావు నుంచి పర్సంటేజీలు తీసుకుంటున్నారు. ఆయనపై ఫిర్యాదు చేస్తే పోలీసులు తీసుకోవడం లేదు. ఇది నా ఒక్కడి సమస్య కాదు చాలా మంది సమస్య. నా బిడ్డ పెండ్లికి ఈ భూమి ఒక్కటే ఆధారం. అది కూడా గుంజుకున్నరు. ఇక నేను ఈ భూమిపై ఉండలేను. ప్రజల సాక్షిగా త్వరలో మాఫియా డాన్ జగన్మోహన్‌రావు, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావుల పేర్లు రాసి ఆత్మహత్య చేసుకుంటా. అప్పుడే నేను ఎవరో మీ అందరికీ తెలుస్తది. నా చిన్న భూమిని విడిచి పెట్టండి. మాలాంటి పేదోళ్ల భూమిని లాక్కోడానికి మీకు మనసు ఎలా వచ్చింది. అని అడిగితే జగన్మోహన్‌రావు వచ్చే ఐదేళ్లలో రూ.100 కోట్లు సంపాదించడమే నా లక్ష్యం. నేను చిన్నా పెద్దా చూడను అన్నారు. నా చావు తర్వాత ఈ ఉత్తరం మాఫియా డాన్ మూలంగా బయటకి రాదేమోననే అనుమానంతో ముందే మీ అందరికీ తెలిసే విధంగా చేస్తున్నాను. నా చావుతోనైనా నా భూమి నా కుటుంబ సభ్యులకు ఇస్తారని అనుకుంటున్నాను. ఇట్లు మాఫియా డాన్ జగన్మోహన్ రావు బాధితులు'' అంటూ లేఖను ముగించారు. ఈ లేఖపై రామగుండం సీపీ శ్రీనివాసులను వివరణ కోరగా ఈ విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. విచారణ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మంత్రివర్గ విస్తరణపై జిల్లా నాయకుల్లో ఎవరో ఒకరికి మంత్రి పదవి వస్తుందని భావిస్తున్న నేపథ్యంలో ఈ లేఖ బయటికి రావడం చర్చనీయాంశంగా మారింది.

రేషన్ బియ్యంలో కోత

51 కిలోలు ఉండాల్సిన బస్తా తూకాల్లో తేడా

- ఒక్కో రేషన్ షాప్‌నకు మూడు నుంచి ఐదు క్వింటాళ్ల దాకా కటింగ్
- ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి మాయాజాలం
- ప్రతిబస్తాలోనూ తగ్గాయంటున్న రేషన్ డీలర్ల ఆరోపణ
- ప్రతినెలా చేతులు మారుతున్న రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షలు

మంచిర్యాల, జూలై 3(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా సివిల్ సప్లయ్ శాఖ తరపున రేషన్ షాపులకు పంపిణీ చేసిన బియ్యం తూకాల్లో తేడాలు ఉన్నాయి. మంచిర్యాల జిల్లా కేంద్రంలో దాదాపు 30 వరకు రేషన్ షాపులు ఉండగా ఇందులో ఐదారుగురు రేషన్ డీలర్లు మంగళవారం తూకంలో తేడాలు ఉన్నాయంటూ 'నమస్తే తెలంగాణ'ను సంప్రదించారు. ఒకటి కాదు.. రెండు కాదు.. వచ్చిన ప్రతి బస్తా బరువు తక్కువగా ఉందంటూ తూకం వేసి మరీ చూపించారు. నిబంధనల ప్రకారం.. ఒక బస్తా 50 కిలోలతోపాటు గన్నీ బ్యాగ్ బరువు ఒక కిలో కలిపి 51 కిలోలు ఉండాలి. కానీ.. రేషన్ షాపులకు ఇచ్చిన బస్తాలు మాత్రం 42 కిలోల నుంచి మొదలై 48 కిలోల బరువు మాత్రమే ఉంటున్నాయి. వచ్చిన బియ్యం బస్తాల్లో ఒకటి, రెండు కిలోలు తక్కువగా ఉంటే ఏమో అనుకోవచ్చు. కానీ.. వచ్చిన ప్రతి బియ్యం బస్తాలో కిలోల కొద్ది తక్కువగా ఉంటున్నాయంటూ డీలర్లు వాపోతున్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు తరలించేందుకు లారీల్లో లోడ్ చేస్తున్న బియ్యం బస్తాలు

మంచిర్యాల టౌన్‌లోని ఓ రేషన్ దుకాణానికి సరఫరా చేసిన బియ్యం బస్తాలో 42 కిలోలే చూపుతున్న తూకం

ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం బస్తాలకు తూకం వేస్తున్న ఇన్‌చార్జి శంకర్

బస్తాలో బరువు తక్కువ ఉండడంతో ప్రతి డీలర్‌కూ మూడు క్వింటాళ్ల నుంచి ఐదు క్వింటాళ్ల వరకు బియ్యం తక్కువగా వస్తున్నాయని పేర్కొంటున్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్‌లోనే అవకతవకలు

మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రేషన్‌షాపులతోపాటు జైపూర్, నస్పూర్, హాజీపూర్ మండలాల్లోని రేషన్ షాపులకు కూడా మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను నుంచే రేషన్ బియ్యం సరఫరా అవుతున్నాయి. కాగా..ఈ సెంటర్ నుంచి వచ్చిన బియ్యం తూకాల్లోనే తేడాలు ఉంటున్నాయి. ఉదాహరణకు.. 100 క్వింటాళ్ల బియ్యం ఓ రేషన్ షాపునకు రావాల్సి ఉంటే.. 50 కిలోల బస్తాలు 200బస్తాలు వేసి, గన్నీ బ్యాగ్ వెయిట్ కింద మరో ఒకటి, రెండు బస్తాలు అదనంగా వేస్తున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో చూసినప్పుడు వాటి బరువు కరెక్ట్‌గానే ఉంటున్నప్పటికీ డెలివరీ తీసుకున్నాక చూస్తే బస్తాకు నాలుగైదు కిలోలు తగ్గుతుందని డీలర్లు వాపోతున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్ తూకాన్ని మార్చి మోసం చేస్తున్నారంటూ ఆరోపిస్తున్నారు. దీనిపై ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి శంకర్‌ను వివరణ కోరగా.. క్వింటాళ్ల కొద్ది ఒకేసారి తూకం వేసి డీలర్లకు అప్పగిస్తున్నామంటున్నారు. మా దగ్గర కరెక్ట్ బరువు ఉన్న బస్తా డీలర్ షాపులోకి వెళ్లాక ఎలా తగ్గుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. బహుశా రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేసే కాంట్రాక్టర్ దగ్గర ఏమైనా లోటుపాట్లు ఉండొచ్చని ఆయన చెప్పారు. మా దగ్గరైతే తూకంలో తేడాలు లేవన్నారు. ఈ విషయంపై డీలర్లను అడిగితే.. మంచిర్యాల జిల్లాలో ఏ షాపునకు వెళ్లి చూసినా బస్తాలో కిలోల కొద్ది బియ్యం తక్కువ తూకం చూపిస్తుందన్నారు. అధికారులు పరిశీలనకు వచ్చి చూసుకోవచ్చని, నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సవాల్ చేస్తున్నారు.

లక్షల రూపాయల దందా

బస్తాకు నాలుగైదు కిలోలే కదా తగ్గింది అనుకోడానికి లేదు. బస్తాకు నాలుగైదు కిలోల చొప్పున చూసుకుంటే 100 క్వింటాళ్లు వచ్చే రేషన్‌షాపులో బస్తాకు నాలుగు కిలోల చొప్పున తీసేస్తే నాలుగు క్వింటాళ్లు అవుతుంది. ఈ లెక్కన ఒక్క మంచిర్యాల జిల్లా కేంద్రంలోని 30 రేషన్ షాపులకు లెక్కవేస్తే 120 క్వింటాళ్లు వరకు తేడా వస్తుంది. అలాగే నస్పూర్, జైపూర్, హాజీపూర్ మండలాల్లోని రేషన్ షాపులను కలుపుకుంటే ఎంత లేదన్న తక్కువలో తక్కువ ప్రతి నెల 250 క్వింటాళ్ల నుంచి 300 క్వింటాళ్ల వరకు నష్టపోవాల్సి వస్తున్నది. బహిరంగ మార్కెట్‌లో రేషన్ బియ్యాన్ని కిలోకు రూ.22 వరకు కొనుగోలు చేస్తున్నారు. మంచిర్యాల నుంచి మహారాష్ట్ర, ఇతర రాష్ట్రాలకు తరలించే ముఠాలు ఇచ్చే ధర ఇది. ఈ లెక్కన ప్రతి నెల రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు చేతులు మారుతున్నాయి. ఈ మొత్తం రేషన్ డీలర్లు ఆరోపిస్తున్నట్లు ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి జేబుల్లోకి వెళ్తున్నాయా.. లేకపోతే ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి రేషన్ షాపులకు బియ్యం సరఫరా చేసే కాంట్రాక్టర్ చేబుల్లోకి వెళ్తున్నాయా.. లేదా ఈ ఇద్దరూ కాకుండా సివిల్ సప్లయ్ శాఖ ఉన్నతాధికారుల జేబుల్లోకి వెళ్తున్నాయా.. అన్నది తేలాల్సి ఉంది. దీనిపై సివిల్ సప్లయ్ శాఖ ఉన్నతాధికారి ఒకరిని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా.. సదరు అధికారి అందుబాటులోకి రాలేదు. డీలర్ల ఆరోపణల నేపథ్యంలో ఇప్పటికైనా అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటారా లేదా అనేది తేలాల్సి ఉంది.

దండేపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

దండేపల్లి, జూలై 3: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ శ్రేణులకు మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పిలుపునిచ్చారు. దండేపల్లి మండల కేంద్రంలోని పద్మశాలీ భవన్లో బుధవారం బీఆర్ఎస్ దండేపల్లి మండల స్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్లబొల్లి కబుర్లు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై 6 నెలల్లోనే ప్రజల్లో తీవ్రమైన వ్యతిరేకత వచ్చిందన్నారు. పాలన వదిలేసి కక్షసాధింపు ధోరణికి పాల్పడుతున్నదని ఆరోపించారు. బెదిరింపులకు కార్యకర్తలు భయపడవద్దని, ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కలసికట్టుగా పనిచేసి పార్టీని బలోపేతం చేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు చుంచు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ అనిల్, పీఏసీఎస్ చైర్మన్ కాసనగొట్టు లింగన్న, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్టేషన్ రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

స్టేషన్ రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలి

కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

వాంకిడి, జూలై 3: పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ప్రతి కేసు రికార్డులను పకడ్బందీగా నమోదు చేయాలని కుమ్రంభీం ఆసిఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావు సూచించారు. బుధవారం వాంకిడి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. సర్వీస్ బుక్స్, లీవ్ రికార్డులతో పాటు తదితర రికార్డులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు గ్రేవ్, నాన్ గ్రేవ్ సీడీ ఫైల్స్‌ను పరిశీలించాలన్నారు. పెండింగ్ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని ఎస్ఐని ఆదేశించారు. దొంగతనాల నివారణకు పెట్రోలింగ్ నిర్వహించాలని, రౌడీ షీటర్స్, సస్పెక్ట్స్, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టాలని బ్లూ కోల్ట్స్ సిబ్బందిని ఎస్పీ ఆదేశించారు. ఎస్పీ సీఐ రాణా ప్రతాప్, సీఐ శ్రీనివాస్, ఎస్ఐ సాగర్ ఉన్నారు.

లాటరీ ద్వారా పనుల కేటాయింపు

- టెండర్ల వ్యవహారంలో పాలకవర్గం, కాంట్రాక్టర్లు కుమ్మక్కు
- పనులు నాణ్యతగా చేసేందుకేనంటున్న మున్సిపల్ చైర్మన్

మంచిర్యాలటౌన్, జూలై 3: మంచిర్యాల మున్సిపాలిటీలో టెండర్ల వ్యవహారం రచ్చకెక్కింది. ఏకంగా పాలకవర్గ సభ్యులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై లాటరీ పద్ధతిన బహిరంగంగానే పనులను కేటాయించుకున్నారు. స్థానిక కాంట్రాక్టర్లే పనులు చేయాలన్న నిబంధనలను విధించుకున్నారు. ఈ విషయంలో ఇద్దరు కాంట్రాక్టర్లకు, పాలకవర్గ సభ్యులకు మధ్యవివాదం తలెత్తింది. మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ సల్ల మహేశ్, కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లతో మంతనాలు జరిపారు. ఏయే పనులు ఎవరు చేయాలి, ఎంత లెస్‌కు టెండరు వేయాలి, పోటీకి ఎవరు రాకుండా ఉండాలి, స్థానిక కాంట్రాక్టర్లకే పనులను అప్పగిస్తాం అన్న అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన ఇరు వర్గాలు ఒక ఒప్పందానికి వచ్చాయి. ఈ మేరకు దాదాపు రూ. పట్టణంలోని 36 వార్డుల్లో కోటి ఆరవై లక్షల రూపాయలతో చేపట్టే 42 పనులను లాటరీ ద్వారా పాలకవర్గ సభ్యులకు కావాల్సిన కాంట్రాక్టర్లకు అప్పగించారు. వార్డుకు నాలుగు లక్షలకు పైబడి అంచనా వ్యయంతో చేపట్టే ఈ పనులకోసం పాలకవర్గ సభ్యులు, కాంట్రాక్టర్లు ఇప్పటికే రెండు సార్లు సమావేశమై చర్చించినట్లు తెలుస్తున్నది. బుధవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఉన్న మెప్మా సమావేశ మందిరంలో చైర్మన్ ఉప్పలయ్య, వైస్‌చైర్మన్ మహేశ్ అధ్యక్షతన కౌన్సిలర్లు, కాంట్రాక్టర్లు సమావేశమయ్యారు. వీరంతా లోపాయికారిగా కుమ్మక్కై పనులు పంచుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. ఈ నెల ఐదో తేదీ వరకు టెండర్ల దాఖలుకు గడువున్నప్పటికీ బుధవారం రోజునే లాటరీ ద్వారా పనులను పంచుకోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంట్రాక్టర్లు సొంతంగా టెండర్లు వేస్తే పోటీకి పోయి దాదాపుగా 10నుంచి 20 శాతం వరకు లెస్ టెండర్లు దాఖలు చేసే అవకాశం ఉంది. దీంతో మున్సిపాలిటీకి నిధులు మిగిలే అవకాశం ఉంది.

పనులను లాటరీ ద్వారా కేటాయిస్తున్న నాయకులు, కాంట్రాక్టర్లు

పనులు నాణ్యతగా చేసేందుకే ..

జనరల్ ఫండ్ నిధులతో చేపట్టే పనులను నాణ్యతతో చేపట్టాలన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్లతో మాట్లాడినట్లు మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య తెలిపారు. ఎక్కువ లెస్‌కు పోకుండా టెండరు వేయాలని సూచించామని, తద్వారా పనుల్లో నాణ్యత పాటించాలని చెప్పామని, ఎవరికీ ఒక్కపైసా కూడా కమీషన్ ఇవ్వొద్దని చెప్పామన్నారు. కేవలం నెలరోజుల్లోనే పనులు పూర్తి చేయాలన్న నిబంధనను పెట్టామని, అందుకు కాంట్రాక్టర్లు ఒప్పుకున్నారని తెలిపారు. ఇందులో ఎలాంటి దురుద్దేశాలు కానీ, అవినీతికి గానీ ఆస్కారం లేదన్నారు.

రుణ లక్ష్యాలను పూర్తి చేయాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే
- బ్యాంకర్లు, అధికారులతో సమీక్ష

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, జూలై 3: బ్యాంకర్లు నిర్దేశిత రుణ లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, బ్యాంకర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాల మేరకు 100 శాతం రుణాలను రైతులు, మహిళా సంఘాలు, అర్హులైన లబ్ధిదారులకు అందించాలని ఆదేశించారు. ప్రధానమంత్రి జన్ ధన్ యోజన, జీవన జ్యోతి బీమా, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజనను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. రుణాలను సద్వినియోగించుకునేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. పంట రుణాలివ్వడంలో రైతులకు ఇబ్బందులు కలిగించవద్దని ఆదేశించారు. వివిధ సంక్షేమ శాఖల ద్వారా అర్హులైన వారికి రుణాలందించాలన్నారు. చేపల పెంపకం, డెయిరీ ఫాం, కోళ్ల పెంపకం, క్యాంటీన్లు, కుట్టు శిక్షణ కేంద్రాలు నిర్వహించే మహిళా సంఘాలకు ప్రోత్సాహం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, ఆర్‌బీఐ అధికారి సాయి తేజ రెడ్డి, నాబార్డ్ డీడీ ఎం. వీరభద్రుడు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రాజేశ్వర్ జోషి, జిల్లా అధికారులు, వివిధ బ్యాంకుల మేనేజర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్‌లో జాతీయ రహదారిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలి

- టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి
- నస్పూర్, మందమర్రిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మల దహనం

సీసీసీ నస్పూర్, జూలై 3: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సింగరేణి పరిధిలోని బొగ్గు బ్లాకుల వేలాన్ని నిలుపుదల చేసి, నామినేషన్ పద్ధతిలో గనులను సింగరేణికే కేటాయించాలని టీబీజీకేఎస్ ప్రధాన కార్యదర్శి సురేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బ్లాకుల వేలాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం సాయంత్రం సీసీసీ నస్పూర్‌లోని తెలంగాణతల్లి విగ్రహం వద్ద రాస్తారోకో చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కారు హయాంలో బొగ్గు బ్లాకులను వేలం వేసేందుకు కేంద్రంలోని బీజేపీ సర్కారు నిర్ణయిస్తే మూడు రోజుల పాటు సమ్మె చేసి అడ్డుకున్నామని తెలిపారు. కేంద్రంలో మరోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం, హైదరాబాద్ కేంద్రంగా బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమక్షంలో బొగ్గు గనులను వేలం వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బీజేపీ, కాంగ్రెస్‌లు సింగరేణికి అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. గతంలో ఒడిషా, చత్తీస్‌గఢ్, గుజరాత్‌కు కేటాయించిన విధంగా నామినేషన్ పద్ధతిలో తెలంగాణకు బొగ్గు బ్లాకులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్, కేంద్ర సంయుక్త కార్యదర్శి పానుగంటి సత్తయ్య, నాయకులు అన్వేష్‌రెడ్డి, పొగాకు రమేశ్, సాధుల భాస్కర్, ఉత్తేజ్‌రెడ్డి, గొర్ల సంతోష్, వెంకట్‌రెడ్డి, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రి, జూలై 3: బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టి బొమ్మను మందమర్రిలో టీబీజీకేఎస్ నాయకులు దహనం చేశారు. టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు సంపత్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు రవీందర్, మున్సిపల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, టీబీజీకేఎస్ కేంద్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, బీఆర్ఎస్, టీబీజీకేఎస్ నాయకులు ఈశ్వర్, లక్ష్మణ్, శంకర్, మల్లేశ్, తిరుపతి రెడ్డి, రాజనర్సు, వెంకటరమణ, రమేశ్, కొట్టె రమేశ్, రాజయ్య, అశోక్, మల్లేశ్, శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, శ్రీకాంత్, రంజిత్, వెంకటేశ్, బైరి శంకర్, వీరారెడ్డి, తిరుపతి, ఉదయ్, శ్రావణ్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...
నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..
- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు
ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679